నవతెలంగాణ
1
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మార్చి 31, 2025 | www.navatelangana.com

జిల్లా ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమతు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసం సందర్భంగా వేసవి తీవ్రతలోనూ నియమ నిష్ఠలతో దాదాపు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు నిర్వర్తించడం ఎంతో గొప్ప విషయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో కాలం వెళ్లదీయాలని, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిమగ్నమైన ముస్లిం సోదరులు, అదే స్ఫూర్తితో సోమవారం నాటి ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ను కూడా భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని కోరారు.

17 టీఎంసీలకు చేరిన ఎస్సారెస్పీ నీటిమట్టం



నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 17 టీఎంసీలకు చేరింది. సాగుకోసం కాలువల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతుంది. మొత్తం సాగు, తాగునీటి అవసరాల కోసం ప్రతి రోజు 8250 క్యూసెక్కుల నీటిని కాలువలకు, ఎత్తిపోతలకు, మిషిన్ భగీరథకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1065.80 అడుగుల(17.103 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 1061.10 అడుగుల(11.624 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ఘనంగా ఉగాది సంబురాలు

- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు
- పలు చోట్ల ఆలయాల చుట్టూ ఎడ్లబండ్ల ప్రదక్షిణ
- కుస్తీ పోటీలు, కోలాటం ఆటలతో వేడుకలు
- కామారెడ్డిలో ఆకట్టుకున్న ఎడ్లబండ్ల ఊరేగింపు

నవతెలంగాణ-విలేకరులబృందం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉగాది పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే ఇల్లు వాకిలి శుభ్రం చేసుకొని.. ఇంటి దోరణాలకు మామిడికాలు పెట్టి సంబుర పడ్డారు. పొలెలు, పచ్చడి చేసుకొని ఆరగించారు. ఇరుగుపొరుగురు వారికి ఇచ్చిపుచ్చుకొని మురిసిపోయారు. కాగా పలు ఆలయాల్లో, కుల సంఘాల భవనాల్లో, కాలనీల్లో పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది విశిష్టతను పురోహితులు తెలియజేశారు. పలు ఆలయాల వద్ద ఎండ్లబండ్ల ఊరేగింపు చేపట్టారు. మరికొన్ని గ్రామాల్లో కుస్తీపోటీలు నిర్వహించారు.

కామారెడ్డి : ఉగాది పండగ సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రం వీక్లీ మార్కెట్, గాంధీ గంజ్, హరిజనవాడ, పెద్దమ్మగల్లి, భారత్ రోడ్, గోపాల స్వామి రోడ్, హరిజనవాడల లోని పురాతన గ్రామ దేవతలైన పెద్దమ్మ, దుర్గమ్మ, ముత్యాలమ్మ, రాజు రాజేశ్వరి, నల్ల పోచమ్మ, ఉరడమ్మ, మత్తడి పోచమ్మ, మల్లన్న, లస్మమ్మ, పోతలింగయ్య, శివ కేశవ కిష్టమ్మ, కోడూరి హనుమాన్, కట్ట మైసమ్మ, మంద మైసమ్మ, గడి మైసమ్మ వేణుగోపాల స్వామి, కాళికాదేవి, కింది వాడకట్టు పోచమ్మలు మొదలైన ఆలయాల చుట్టూ తిప్పడంతో పాటు మహత్మ గాంధి, అంబేద్కర్ విగ్రహాల చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శనతో రైతులు, కుల సంఘాల వారు, యువజన సంఘాల వారు పెద్ద ఎత్తున ఎడ్ల బండ్లను ప్రదక్షిణలు నిర్వహించారు. అంతకుముందు తమ ఎడ్లబండ్లను రంగురంగులతో చూడముచ్చటగా అలంకరించారు. ఇట్టి ఎడ్ల బండ్ల ప్రదర్శనను తిలకించేందుకు పూర ప్రముఖులందరూ పట్టణ నాలుములల నుండి ప్రజలు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఇట్టి ఎడ్ల బండ్ల ప్రదర్శనకు కామారెడ్డి పట్టణ అభివృద్ధి సదరు సంఘం వారు గ్రామ దేవతల ఆలయాలకు రంగులు వేసి ముస్తాబు చేయగా, కామారెడ్డి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఎడ్ల బండ్లు ఊరేగింపు తిరిగే ప్రాంతాల్లో మొరం, లైట్లు, మంచినీరు, టెంట్లు ఏర్పాటు చేయించారు. కామారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు

గాంధారి : గాంధారి మండలంలోని నేరల్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు మండల ప్రజలు అమితంగా ఆకట్టుకున్నాయి. నేరల్ గ్రామంలో నిర్వహించే కుస్తీ పోటీ లలో పాల్గొనడానికి మల్ల యోధులు జిల్లా నలు మూలలుండే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి రావడంతో కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. రూ.100 నుండి మొదలుకొని 1000 కుస్తీ పోటీలు నిర్వహించారు. ఒక తులం వెండి కడెం కుస్తీలు మూడు నిర్వహించారు. చివరగా మూడు తులాల కడెం కుస్తీ నిర్వహించారు. సుమారు 40,000 రూపాయల వరకు కుస్తీపోటీలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు గ్రామస్తులు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మల్ల యోధులు పాల్గొన్నారు.

కల్యాపూర్‌లో కుస్తీ పోటీలు

రెంజల్ : రెంజల్ మండలం కళ్యాపూర్ గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి మల్ల యోధులు అధిక సంఖ్యలో వచ్చారు. పోటీలో చివరి కుస్తీ 2500 లకు మహారాష్ట్రలోని బెల్లూరికి చెందిన విలాస్ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గాండ్ల నాగరాజ్, శంకర్, కిన్నెర మోహన్, బాలయ్య ల తో పాటు స్థానిక నాయకులు మైని మోహన్, పోతన్న, ఒడ్డెక్క మోహన్, జలయ, గ్రామ పెద్దలు, యువత, తదితరులు పాల్గొన్నారు.





కామారెడ్డి పట్టణంలో ఎడ్లబండ్ల ఊరేగింపులో పరుగులుపెడుతున్న ఎడ్లబండి.. పెద్దఎత్తున హాజరైన ప్రజలు



గాంధారి : నెరల్‌లో తలపడుతున్న మల్లయోధులు.. వీక్షిస్తున్న ప్రజలు..



రెంజల్ మండలం కల్యాపూర్‌లో..

బతుకుబాట.. మెతుకు వేట



- గ్రామాల్లో పశుగ్రాసం కరువు
- పశువులతో కలిసి పచ్చికబయళ్ల కోసం వందలాది కిలోమీటర్ల ప్రయాణం
- వర్షాలు కురిసే వరకూ ఇంటికి దూరం

నవతెలంగాణ-లింగంపేట్

వేసవి ఎండలు ముదురుతుండటం.. మరో వైపు చెరువులు, భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో గ్రామాల్లో పచ్చికబయళ్లు మాయమవుతున్నాయి. దీంతో పశువుల పెంపకం మీదనే ఆధారపడిన రైతులు.. పశువులకు గ్రాసం లేక వాటితో కలిసి దూర ప్రాంతాలకు ప్రయాణం అవుతున్నారు. పశువులకు దాణా కోసం పలు పథకాలు ఉన్నా.. అవి కేవలం కాగితాలకే పరిమితం కావడంతో ప్రతేడూ వేసవికంటే ముందు పశువులకు ఇతర ప్రాంతాలకు ప్రయాణం కావడం తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఇంటిల్లిపాదిని వదిలి మేత కోసం ఇతర ప్రాంతాలకు పశువులను తీసుకెళ్తున్నట్టు చెబుతున్నారు.

కామారెడ్డి జిల్లాలో అధికారుల అంచనా ప్రకారం 10.68 లక్షల పశువులున్నట్టు సమాచారం. ఇందులో తెల్ల పశువులు 1 లక్ష 16 వేల 192 ఉన్నాయి. గేదలు 1 లక్ష 91 వేల 803, మేకలు 1 లక్ష 70 వేలు, గొర్రెలు 5 లక్షల 89 వేల వరకు ఉన్నాయి. అయితే జిల్లాలో మాచారెడ్డి, రామారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్, గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, రాజంపేట, ఎల్లారెడ్డి, బాన్సువాడ నిజాంసాగర్ పిట్లం మండలాల్లో పశుసంపద అధికంగా ఉంది. గిరిజనులు మారుమూల ప్రాంతవాసులు అధిక శాతం పశువుల పెంపకం పై ఆసక్తి చూపుతున్నారు.

పవుగ్రాసం కోసం ఇతర ప్రాంతాలకు

పశుగ్రాసం రోజురోజుకు కరువు కావడంతో పశువు పెంపకం దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం పశుసంపదను పెంచాలని సూచించి నప్పటికీ గ్రాసం లేకపోవడంతో రైతులు గిరిజనులు పశువులు పెంచక దానికి ముందుకు రావడం లేదు. అంతేకాకుండా వరి కోత యంత్రాలు రావడంతో పశువులకు పూర్తిగా కరువైందంటున్నారు. వరి పంటలు పండించిన రైతులు కూలీల సాయంతో వరి కోతలు కోస్తే పశు పెంపకం దారులకు ఎంతో మేలు చేకూరుతుండేది. ప్రస్తుతం వరి కోతకు యంత్రాలను ఉపయోగించడంతో గడ్డి పూర్తిగా కనుమరుగైపోతుంది. కోత మిషిన్‌తో కోసిన వరి గడ్డిని పశువులు తినడం లేదు. దీంతో పాటు మొక్కజొన్న పంటను సైతం నరికిన మక్క కంకులు తీయడానికి యంత్రాలను ఉపయోగించడంతో మొక్కజొన్న పశు గ్రాసం పశువులకు లేకుండా పోతుంది. దీంతో పశు పెంపకం దారులు పశుగ్రాసం కొనడానికి సిద్ధంగా ఉన్నా లభించడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.

ఆరు నెలలు పశువుల తోటే

ప్రస్తుతం వేసవి నేపథ్యంలో పచ్చిక బయళ్ళ సైతం కనుచూపు మేరలో కనిపించడం లేదు. అడవిలో సైతం పచ్చగడ్డి లేకపోవడంతో పశువుల దారులు.. ఇంటిని, ఊరును వదిలి ఇతర ప్రాంతాలకు పశువులను తీసుకొని వెళ్తున్నారు. ఎక్కడ పశుగ్రాసముంటే అక్కడి ప్రాంతాలకు తరలుతున్నారు. వంటసామాను కట్టుకొని తరలుతున్నారు. ముఖ్యంగా లింగంపేట్ మండల వాసులు ఎక్కువగా నిజాంసాగర్, పోచారం, మెదక్, మానేరు, మాచారెడ్డి పరిసర ప్రాంతాలకు, సింగీతం పరిసర ప్రాంతాలకు మేత కోసం పశువులను తరలిస్తున్నారు. అక్కడ నీటి వనరులు ఉండటంతో చుట్టుపక్కల పచ్చదనం ఉండటంతో పశులను తరలిస్తూ అక్కడే వంట చేసుకుంటూ తింటూ ఉంటున్నారు. వర్షాలు పడే వరకూ ఇలా వివిధ ప్రాంతాలకు తరలుతూనే ఉంటారు.



కాగా పశుగ్రాసం లభించకపోవడంతో జిల్లాలో ఏటేటా పశుసంపద క్రమంగా తగ్గిపోతోంది. లింగంపేట మండలంలో 29,540 పశువులు గేదెల గాను ప్రస్తుతం 26 వేల వరకు ఉన్నట్టు సమాచారం.

ప్రజలు విజయాలు అందుకోవాలి

- ఉగాది వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు పోచారం
- ఆలయంలో గ్రంథాలయం నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-బాన్సువాడ



గ్రంథాలయం నిర్మాణానికి భూమిపూజ

ప్రజలం దరూ విజయాలు అందుకుంటూ ఆనందమయంగా ఉండాలని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. తెలుగు నూతన సంవత్సరాది "శ్రీ విశ్వావసు" నామ ఉగాది పండుగ సందర్భంగా బీర్కూర్ మండలం తిమ్మాపూర్ శివారు తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పోచారం పాల్గొన్నారు. శ్రీ లక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామిని వారిని దర్శించుకొని ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన ఉగాది పండుగ వేడుక, పంచాంగ శ్రవణంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాలరాజు పోచారం శంభు రెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 50లక్షల 50వేల రూపాయలతో గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, బీర్కూర్ మండల ప్రజాప్రతినిధులు,నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- కోతలు పూర్తయిన ధాన్యం కొనుగోలు పూర్తిచేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్

నవతెలంగాణ-సాలూర

ప్రస్తుతం వరి కోతలు పూర్తయి వడ్లు చేతికి వచ్చినా.. ప్రభుత్వం ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం లేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్ అన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తేమ శాతం వచ్చిన ధాన్యం సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వడగండ్ల వాన రాకముందే.. పెద్దఎత్తున ధాన్యం సేకరించాలని కోరారు. నిజామాబాద్ జిల్లా సాలూరు మండలం సాలంపాడు గ్రామంలో రైతు వెంకటేశ్వర పొలంలో వడ్లను తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంగాధరప్ప, పల్లపు వెంకటేశు నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోతలు జోరు అందుకుంటున్న సందర్భంగా ఇప్పటికే వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉన్నా.. ఇంకా ప్రారంభించలేదని అన్నారు.

ప్రస్తుతం అకాల వర్షాలు, వడగండ్లు కురిసే అవకాశం ఉందని, దీంతో ఆరుగాలం శ్రమించిన రైతుల కష్టం రోడ్డుపాలయ్యే అవకాశం ఉందని అన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమశాతం 17 శాతం ఉన్నా కొనుగోలు చేయాలని యాసంగి పంట వడ్లు ఎక్కువ ఎండిన నూక అవుతుందని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు.

బోనస్ డబ్బులు చెల్లించాలి

ప్రభుత్వం ఖరీఫ్‌లో కొనుగోలు చేసిన సన్నవడ్లకు సంబంధించి రైతులకు ఇంకా బోనస్ ఇవ్వలేదని వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా నిధులు సైతం రైతుల ఖతాల్లో జమ చేయాలని కోరారు. దీంతో పాటు వర్షాకాలం పంటలకు సంబంధించి ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచాలని నకిలీ విత్తనాలు తీసుకొస్తున్న వ్యాపారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వర రెడ్డి, వెంకటేశ్వరరావు, డిజా ఎల్లయ్య, పల్లె హనుమాన్లు, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఈద్గాలు, మసీద్‌లను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



పర్యటిస్తున్న సీపీ

నిజామాబాద్ డివిజన్ పరిధిలో గల ఈద్గాలను, మసీద్‌లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదివారం సందర్శించారు. టౌన్ 5లో పరిధిలోని శాంతి నగర్ ఈద్గాను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఈద్గా పెద్దలతో మాట్లాడారు. పోలీస్ ఆఫీసర్ లకు పలు సూచనలు ఇచ్చారు. నిజామాబాదు డివిజన్ పరిధిలో దాదాపు 450 మంది పోలీస్ సిబ్బంది తో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టుతెలిపారు. అన్ని ప్రాంతాలలో పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేశారు. పటిష్టమైన నిఘా వ్యవస్థ, ముఖ్యమైన ప్రాంతాలలో ట్రాఫిక్ డైవర్షన్ ఉందని, ప్రతీ ఒక్కరూ పోలీస్ వారికి సహకరించాలని సూచించారు. సీపీ వెంట నిజామాబాద్ ఏసిపి రాజా వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఏ.సి.పి. నారాయణ, సిఐలు, ఎస్సై లు , ఈద్గా పెద్దలు అబ్దుల్ రెహమాన్, ప్రెసిడెంట్ , రఫీక్ బాయ్ , హైసన్ పాషా, వాషిమ్ భాయ్ తదితరులు ఉన్నారు.

నిషేధిత అల్ప్రాజోలం స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్టు.. పరారీలో ఓ పత్రిక విలేకరి
- యువత మాదకద్రవ్యాలు, గంజాయి, అల్ప్రజోలమ్ వంటి నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ యం. రాజేష్‌చంద్ర

నవతెలంగాణ-కామారెడ్డి



ముగ్గురు నిందితుల అరెస్టు.. అల్ప్రాజోలం, ముడి సరుకు స్వాధీనం

నిషేదిత అల్ప్రాజోలం కలిగిన ఉన్న, సరఫరా చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మరో నిందితుడు ఓ పత్రిక విలేకరి పరారీలో ఉన్నట్టు కామారెడ్డి ఎస్పీ రాజేశ్‌చంద్ర తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. శనివారం నమ్మదగిన సమాచారం మేరకు బిచ్కుంద సీఐ నరేష్ తన సిబ్బంది తో కలసి మద్నూర్ గ్రామంలో కులవృత్తి నిర్వహిస్తున్న ఉదాతలవర్ సురేష్ గౌడ్ ఇంట్లో బాన్సువాడ డిఎస్పి సత్యనారాయణ ఉత్తర్వుల ప్రకారం సోదాలు చేయగా నిషేధిత మత్తు పదార్థం అయిన ఆల్ప్రాజోమ్ 110 గ్రాములు లభించిందని మద్నూర్ ఎస్సై విజయ్ తెలిపినట్టు తెలిపారు. ఇట్టి ఆల్ప్రాజోమ్‌ను కల్లులో కలపగా ఎక్కువ మత్తు వస్తదని తెలిపారు. వెంటనే సురేష్ గౌడ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తాను ఇట్టి అల్ప్రజోలమ్‌ను హైదరాబాద్‌లోని నాచారంలో గల దినేష్ కుమార్ మొహంతి నుంచి కొనుగోలు చేసినట్టు తెలిపారు. వెంటనే సురేష్ గౌడ్ తో సహ బిచ్కుంద సీఐ తన సిబ్బందితో కలసి హైదరాబాద్‌లోని నాచారం వద్ద గల టెంపుల్ ఆర్గానిక్ ల్యాబ్ వద్దకు వెళ్ళి, అక్కడ దినేష్ ను అదుపులోకి తీసుకొని విచారించగా ఇట్టి నిషేధిత అల్ప్రజోలమ్‌ను కృష్ణ వద్ద కొని కొంత లాభంతో ఇతరులకు అమ్ముతున్నట్టు తాను అని బొడ్డు కృష్ణ అనే వ్యక్తిని కూడా చూపించాడు. తాను కృష్ణ వద్ద కొనుగోలు చేసిన అల్ప్రజోలమ్‌ను మద్నూర్‌లోని సురేష్ గౌడ్‌తో పాటు మద్నూర్ ఈనాడు విలేఖరి అయిన శ్రీనివాస్ గౌడ్‌కు వివిధ సందర్భాలలో విక్రయించినట్టు తెలిపారు.

తదుపరి బొడ్డు కృష్ణని అదుపులోకి తీసుకొని విచారించగా.. నాచారంలోని టెంపుల్ ఆర్గానిక్ ల్యాబ్ నందు 8 రకాల ముడి సరకులను ఉపయోగించి ప్రభుత్వ నిషేధిత అల్ప్రజోలమ్‌ను తయారు చేస్తానని చెప్పాడు. అదే విధంగా తాను తయారు చేసిన అల్ప్రజోలమ్ ను దినేష్ అనే వ్యక్తికి తక్కువ దరకు అమ్మగా పెద్ద మొత్తంలో లాభంతో అతడు ఇతరులకు అమ్ముతాడు అని తెలిపినాడు. చట్టప్రకారం పంచుల సమక్షంలో అట్టి నిషేదిత అల్ఫ్రోజోమ్‌ను స్వాధీన పరచుకొని నేరస్తులపై ఇట్టి విషయంలో మద్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఎస్పీ తెలిపారు. మద్నూర్‌కు చెందిన సురేశ్‌గౌడ్‌తో పాటు హైదరాబాద్‌లో ఉంటున్న దినేశ్‌కుమార్, బొడ్డు కృష్ణను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరి నుంచి మొత్తం 263 గ్రాముల అల్ప్రాజోలం, మొబైల్ ఫోన్‌లు, ముడి సరుకులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మరో నిందితుడు విలేకరి అయిన శ్రీనివాస్‌గౌడ్ పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు ఇట్టి కేసులో ముందస్తు సమాచార సేకరణ నుండి నేరస్తుల అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్న వస్తువుల వరకు చాకచక్యంగా వ్యవహరించిన మద్నూర్ యస్ఐ విజయ్, బిచ్కుంద సిఐ నరేష్, బాన్సువాడ డిఎస్పి సత్యనారాయణతో పాటు సిబ్బందిని జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర అభినందించారు. ఈ సందర్భంలో ఎస్పి మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో నిషేదిత మత్తు పదార్థాలు కలిగి ఉన్నా.. సరఫరా చేసిన, అమ్మిన, వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.



పండుగపూట విషాదం

ప్రమాదవశాత్తు చెరువులో నీటమునిగి తల్లీ ముగ్గురు పిల్లలు మృతి

- ఎల్లారెడ్డి మండలం వెంకటాపూర్‌లో ఘటన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి (లింగంపేట్)

పండుగ పూట తీవ్ర విషాదం నెలకొంది. వ్యవసాయ పనులు ముగించుకొని దుస్తులు ఉతికేందుకు తల్లి వెంట ముగ్గురు పిల్లలు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో నీట మునిగి నలుగురూ మృతిచెందారు. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎల్లారెడ్డి సీఐ రవీందర్, ఎస్సై మహేశ్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం భిక్కనూరు గ్రామ పరిధిలో గల వెంకటాపూర్ గ్రామానికి చెందిన లింగయ్యకు కళ్యాణి గ్రామానికి చెందిన మహిళతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుర్లు, ఒక్క కుమారుడు ఉన్నారు. ఆమె గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. దీంతో ఆయన మౌనిక(26)ను రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్య మౌనిక ముగ్గురు పిల్లలు మైతిలి (10), అక్షర(9), వినయ్(7)తో కలిసి శనివారం మధ్యాహ్నం పొలం పనుల నిమిత్తం వెళ్లారు. పొలం పనులు పూర్తయిన అనంతరం సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి మౌనిక దుస్తులు ఉతుకుతుండగా.. ముగ్గురు పిల్లలు స్నానం చేసేందుకు చెరువులో దిగారు.

కాగా.. చెరువులో భారీ గుంత ఉండడంతో పిల్లలు అందులో మునిగిపోయారు. అరుపులు కేకలు వేశారు. వారిని గమనించిన తల్లి మౌనిక కాపాండేందుకు వెళ్లి ఆమె కూడా నీట మునిగింది. ఈత రాకపోవడంతో నలుగురూ చెరువులో నీట మునిగారు. సాయంత్రం దాటినా నలుగురు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. చెరువు వద్దకు వెళ్లి చూడగా.. దుస్తులు కనిపించాయి. పోలీసులకు సమాచారం అందించగా వాడు హుటాహుటన ఘటన స్థలానికి చేరుకుని చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి తర్వాత వినయ్ మృతదేహం నీటిపై తేలింది. దీంతో మిగతా వారికోసం గాలించగా ఆదివారం ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. అందరితో కలివిడిగా తిరుగుతూ బోసినవ్వులు చిందించే పిల్లలు, తల్లీ మృత్యువాత పడటంతో ఊరంతా శోకం నిండింది.



రాజీవ్ యువ వికాస పథకాన్ని వినియోగించుకోవాలి

నవతెలంగాణ-భీంగల్ రూరల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధిని పెంపొందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు డైడి.సురేష్ పేర్కొ న్నారు. ఈ పథకం నియోజకవర్గంలోని యువకులు అప్లై చేసే విధానాన్ని కార్యకర్తలు వివరించాలని తెలిపారు. ఈ పథకం కింద లక్ష రూపాయల వరకు రుణాలకు 80 శాతం సబ్సిడీ. రెండు లక్షల వరకు ఉన్నవారికి 70శాతం సబ్సిడీ, మూడు లక్షల వరకు రుణాలకు 60 శాతం సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. ఈ పథకం షెడ్యూల్ కులాలు (ఎస్సీ) షెడ్యూల్ తెగలు (ఎస్టీ) వెనుకబడిన తరగతులు (బీసీ) ఈడబ్ల్యూఎస్ మైనార్టీ వర్గాల యువతకు స్వయం ఉపాధి రుణాలను అందిస్తుందని ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం అర్హత కలిగిన లబ్ధిదారులకు స్వయం ఉపాధి యూనిట్లను స్థాపించడానికి మూడు లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయం లభిస్తుందని తెలిపారు. దరఖాస్తు పరిశీలన వచ్చే నెలలో ప్రారంభమవుతుందని, ఎంపిక చేయబడిన లబ్ధిదారులకు జూన్ 2న తెలంగాణ నిర్మాణ దినోత్సవం రోజున రాయితీ రుణ మంజూరు పత్రాలు అందిస్తారని తెలిపారు.

మహతి ఆశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-బాల్కొండ



బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సెవెళ్ల మహేందర్ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని మహతి ఆశ్రమంలో ఆదివారం బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయకుడు సంతోష్ ఆధ్వర్యంలో చిన్నారుల మధ్య ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు అన్నదానం నిర్వహించి, ఉగాది పర్వదినం సందర్భంగా ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. మహతి గోశాలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మహతి ఆశ్రమ నిర్వాహకులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు అంబటి నవీన్, బీజేవైఎం మండల అధ్యక్షులు జక్కం శ్రీకాంత్, కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు తోట చిన్నయ్య, ముప్కాల్ బీజేవైఎం మండల ప్రధానకార్యదర్శి నరేష్ శేఖర్ , బీజేపీ నాయకులు ఉన్నారు.

కేటీఆర్‌కు జీవన్‌రెడ్డి ఉగాది శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఆర్మూర్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో కలిసి ఉగాది పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీనివాసనగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శ్రీనివాస నగర్ కుక్కలగుట్ట 23 వార్డులో సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కుక్కల బెడద తీవ్రంగా ఉందని, మున్సిపల్ అధికారులు స్పందించి వాటి బెడదను అరికట్టాలని కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ జంగం అశోక్ కోరారు. అదే విధంగా ఆయా ప్రాంతాల్లో పలు నిర్మాణాలు జరుగుతుండగా.. సదరు ఇంటి యజమానులు ఇసుకను రోడ్డుపై పోసి 25 రోజులు గడుస్తున్నా తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులవు తున్నట్టు తెలిపారు.

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఉగాది ఉత్సవాలు



ఉగాది ఉత్సవాలలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూరు గ్రామ శివారు క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఉగాది ఉత్సవాలు ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం పూలతోరణాలతో అలంకరించారు. విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని ఉగాది వేడుకలను మరింత శోభాయమానంగా మార్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శ్రీ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉగాది పండుగ కొత్త సంవత్సరానికి నాందిఅని, ఇది నూతన లక్ష్యాలను నిర్ణయించుకోవడానికి, విజయపథంలో ముందుకు సాగడానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ఖచ్చితంగా నిర్ణయించుకుని శ్రమించి, సమాజానికి విలువైన సేవలందించాలని సూచించారు. కళాశాల సెక్రటరీ శ్రీ అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ.. "సంస్కృతి, సంప్రదాయాలు మన జీవితంలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని తెలిపారు. ఈ ఉత్సవాలు మన మూలాలను గుర్తు చేస్తాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఉగాది పండుగ మనకు కొత్త శక్తిని, కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని, విద్యార్థులు విజ్ఞానాన్ని సంపాదించడానికి అంకితభావంతో ముందుకు సాగాలని విజయం సాధించడానికి కృషి, ధైర్యం, పట్టుదల అవసరం" అని ప్రేరణగా మాట్లాడారు. ఉగాది పచ్చడి తయారీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ కె పాండే, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో హనుమాన్ స్వాముల శోభయాత్ర



శోభయాత్రలో పాల్గొన్న హనుమాన్ స్వాములు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బ్రాహ్మణపల్లి గ్రామంలో హనుమాన్ స్వాముల శోభాయాత్ర నిర్వహించారని మాజీ సర్పంచ్ శ్రీపతి శేఖర్ ఆదివారం తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఉగాది సందర్భంగా ప్రజలందరూ పాడిపంటలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ గ్రామం గ్రామంలో భక్తిశ్రద్ధలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురు స్వాములు శ్రీపతి శేఖర్, అల్లం అశోక్, సాయిరాం, గంగారం, మల్లయ్య, బుజ్జి, బాలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందూరు తిరుమలలో సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోని ఇందూరు తిరుమల క్షేత్రంలో ఉగాది సందర్భంగా శ్రీ నాట్య తరంగిణి నృత్య అకాడమీ గురువులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వారి శిష్య బృందం వివిధ నృత్య రూపకాలను ప్రదర్శించారు. ఆహుతులను, భక్తులను విశేషంగా ఆకర్షించింది. చిన్నారులను, గురువులు శ్రీనివాస్‌ని ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ కుమారాచార్య స్వామి ఆశీర్వదించి ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సేవకులు నరాల సుధాకర్, నర్సారెడ్డి, భాస్కర్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఈద్‌కా చాంద్ నజర్ ఆగయా

- నేడే రంజాన్
- ఈద్గాల వద్ద ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఈద్-ఉల్-ఫితర్‌కా చాంద్ నజర్ ఆగయా.. నేడు దేశంలో ముస్లింలకు పెద్ద పండగ. ఆధ్యాత్మిక, సోదరభావాన్ని పరిమళింపజేసే పవిత్ర మాసంగా ముస్లింలు రంజాన్ నెలను భావిస్తారు. ఈ మాసంలో నిష్టతో ఉపవాస దీక్షలు చేపట్టి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గల్ఫ్‌లో ఆదివారం.. మన దేశంలో నేడు..

గల్ఫ్ లో శనివారం నెలవంక దర్శన మివ్వడంతో ఆదివారం ఈద్- ఉల్-ఫితర్ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. మన దేశంలో ఆదివారం నెలవంక దర్శనం ఇవ్వడంతో సోమవారం పండుగను నిర్వహించుకుంటున్నారు. గల్ఫ్‌లో మన దేశంలో కంటే ఒకరోజు ముందుగానే రోజా ఉపవాస దీక్షలు మొదలు కావడంతో మన దేశంలో ఒక రోజు ఆలస్యంగా రంజాన్ దీక్షలను పాటించారు.

ప్రార్థనలకు ఈద్గా, మసీదులు సిద్ధం..

రంజాన్ పండుగ కోసం మస్జీద్ కమిటీల ఆధ్వర్యంలో ఈద్గాలను కొన్ని రోజుల నుండే సర్వం సిద్ధం చేశారు. రంజాన్ నెల మొదలైనప్పటి నుంచే ఆయా కమిటీల ఆధ్వర్యంలో మసీద్, ఈద్గాలను శుభ్రం చేసి రంగులు, ఇతర కార్యక్రమాలు చేపట్టారు. ఈదుల్- ఫితర్ ను పురస్కరించుకుని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

ప్రజల జీవితాల్లో కొత్త కాంతులు రావాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



నవతెలంగాణ-ఆర్మూర్

ప్రజల జీవితాల్లో కొత్త కాంతులు రావాలని కోరుకుంటూ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రజలకు శ్రీ విశ్వవసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు ఆదివారం తెలిపారు. ఈ విశ్వ వసు నామ సంవత్సరంలో ప్రజల జీవితాల్లో కొత్త కాంతులు రావాలని.. ప్రతి ఇంట్లో నిత్య వసంతాలు పూయాలని.. సమస్యలను సమర్థంగా ఎదుర్కొంటూ విజయపథంలో ముందుకు సాగాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని చెప్పుకొచ్చారు. అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

మాజీ ఉప సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మనోహ రాబాద్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ రోడ్డ సురేష్ ఇటీవల కాలంలో మరణించారు. ఆదివారం ఆయన కుటుంబాన్ని ప్రజాపంతా మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్, బి.దేవారం, ఎం.ముత్తన్న, దళిత ఇక సంఘటన జిల్లా అధ్యక్షులు సావెల్ గంగాధర్ పరామర్శించారు. కార్యక్రమంలో మాడవెడి బాలయ్య, రొడ్డ రవి, ఆర్.పి.గంగారం, తదితరులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణం.. పచ్చడి వితరణ

- ఘనంగా ఉగాది వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జంబి హనుమన్ దేవస్థానంలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి చంద్రాభిషేకం, సింధూర పూజ, అష్టోత్తర పూజ జరిగిందని ఆలయ అర్చకులు కిషోర్ చార్యులు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన చార్యులు పంచాంగ శ్రవణం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రేగుళ్ల సత్యనారాయణ తెలిపారు. భక్తులకు ఉగాది పచ్చడి వితరణ చేశారు. ఆలయ కమిటీ డైరెక్టర్లు దొండి రమణ, నారాయణరెడ్డి, ఆలయ కమిటీ సిబ్బంది ఉన్నారు.

భీంగల్ రూరల్ : మండలంలోని జాగిర్యాల, పిప్రి, బడాభీంగల్, చెంగల్ గ్రామలలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగ పర్వదినాన గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద అన్నదాన సత్రాన్ని ఏర్పాటుచేశారు. ఘనంగా నిర్వహించారు. ఉగాది అంటేనే "యుగాది," అంటే కొత్త యుగానికి ఆరంభం అని అర్థం అని గ్రామ ప్రజలు తెలిపారు. ఉగాది ప్రకృతిలో మార్పు తీసుకొచ్చే కొత్త సంవత్సరం, ఉగాది పచ్చడి గొప్ప ఔషధం అని అన్నారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు వినిపించారు.

టిఎన్జీవో ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు

కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోఎస్ భవన్ లో ఉగాది పండుగను పురస్కరించుకొని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ అధ్యక్షతన విశ్వవసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. పశుపతి శర్మతో పూజల అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. అన్ని రాశుల వారికి సర్వ శుభాలు జరగాలని ప్రత్యేక పూజలు నిర్వహించి అందరిని ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఉగాది పచ్చడి అందజేసి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, టీఎన్జీవో కేంద్ర ఉపాధ్యక్షులు గైని గంగారం, కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, టీఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు చిట్టి నారాయణ రెడ్డి, జిల్లా కోశాధికారి దినేష్ బాబు, ఆర్మూర్ యూనిట్ అధ్యక్షులు శశికాంత్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు జ్ఞానేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, భీంగల్ యూనిట్ అధ్యక్షులు సృజన్ కుమార్, సర్వే యూనిట్ కార్యదర్శి సతీష్ కుమార్, టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సభ్యులు గురు చరణ్, సునీల్, టీఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్, క్లాస్ ఫోర్ యూనియన్ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాస్, వీరేందర్ సింగ్, ప్రసాద్ ఎన్జీవో మాజీ మహిళా కార్యవర్గ సభ్యురాలు వసుమతి దేవి పాల్గొన్నారు.

నగర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి..

తెలుగు నూతన సంవత్సరంలో నగర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ సార్వజనిక్ గణేష్ మందిర్ ప్రధాన అర్చకులు కోరుకున్నారు. ఆదివారం శ్రీ విశ్వావసు తెలుగు నూతన సంవత్సర ఉగాది పండుగని పురస్కరించుకొని స్థానిక రైల్వే గేట్‌నందు గల శ్రీ సార్వజనిక్ గణేష్ మందిరంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో తెలుగు నూతన సంవత్సరం ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు బీరెల్లి విజయరావు తెలిపారు. ప్రధాన అర్చకులు పంచాంగ శ్రవణం ద్వారా రాశి ఫలాలు తెలియజేశారు. క్లబ్ సభ్యులు భక్తులకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ పులిహోర, పచ్చడి ప్రసాదాలను అందించారు. ఈ కొత్త తెలుగు సంవత్సరాది మనందరికీ ఆయు ఆరోగ్య సుఖసంపదలనూ అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు. తదనంతరం ప్రధాన అర్చకులకు కమిటీ సభ్యులకు శాలువులతో సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు కార్యదర్శి గంగారెడ్డి, నర్సింగరావు, గురుప్రీత్ సింగ్, బెజగం అశోక్, వీరేంద్ర పార్మర్, గోపాల్ జవహర్, గణేష్ గుప్తా, కటకం శ్రీనివాస్, రమేష్ గిల్డ, కమల్ గిల్డ, అతుల్ మంగే, ఆకుల అశోక్, శివ పవర్, జ్ఞాన ప్రకాష్, రాజ్ కుమార్ సుబేదార్, పద్మ, ఆర్తి, అనుపమ సుబేదర్ తదితరు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉగాది ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మానాల

కమ్మర్‌పల్లి : మండలంలోని చౌట్ పల్లి గ్రామ శివారులోని గుండు హనుమాన్ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర కో ఆపరేటివ్ సొసైటీ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ప్రత్యేక ఆహ్వానం మేరకు శ్రీ విశ్వాసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఉగాది ఉత్సవాల కార్యక్రమంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకేట రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, జిల్లా కిసాన్ కేత్ ఉపాధ్యక్షుడు పడిగేలా ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : మండల కేంద్రంతో పాటు మండలంలో విశ్వవసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఆయా గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ ఆలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి ఇంట ఉగాది పచ్చడి చేసుకున్నారు. మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి తయారు చేసి గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎస్ఐ వి.రజినీకాంత్ పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయకుడు సంతోష్, బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్ రెడ్డి, ముస్కు నర్సయ్య, బద్దం చిన్న హన్మండ్లు, మాజిత్, కె.గంగాధర్, చింతల నర్సయ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



భీంగల్ రూరల్: హనుమాన్ ఆలయంలో అన్నదానం



కంఠేశ్వర్: టీఎన్జీవో ఆధ్వర్యంలో...



కమ్మర్‌పల్లి: ఆలయంలో పూజలు చేస్తున్న మానాల



ముప్కాల్: ఉగాది సందర్భంగా పచ్చడి పంపిణీ

యువత కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి

- నుడా చైర్మన్ కేశవేణు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని బైపాస్ రోడ్‌లో ఆర్ఎం ఎంటర్టైన్మెంట్ మినీ థియేటర్ డాల్బీ ఆటోమ్స్‌ను ఆదివారం నుడా చైర్మన్ కేశ వేణు ప్రారంభించారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్ కేశవేణు మాట్లాడుతూ.. యువత డబ్బు సంపాదించే మార్గాన్ని వివిధ రంగాల ద్వారా ఉపయోగించుకోవచ్చని అన్నారు. ప్రవేట్ హోమ్ థియేటర్ జిల్లాలో మొట్టమొదటిసారిగా యజమానులు రవి, చరణ్ ప్రారంభించడం చాలా గర్వకారణమని అన్నారు. ఈ మినీ హోమ్ థియేటర్లో చిన్న చిన్న పుట్టినరోజు, పెండ్లి రోజు వంటి వేడుకలు, తదితర సెలబ్రేషన్స్ నిర్వహించుకునేందుకు మంచి వాతావరణం యాజమాన్యం కల్పించడం శుభ పరిణామం అని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో యువత కోసం యువ వికాస్ అనే పథకం ద్వారా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మంచి ఆలోచనలు కలిగి ఉన్న యువతకు డబ్బు సంపాదించుకోవడానికి ఇదొక మంచి మార్గమని తెలిపారు. ఈ మినీ హోమ్ థియేటర్ నిర్వాహకులు కే.చరణ్, రవిలను ఆయన అభినందించారు. అందరు స్వయంకృషితో పనిచేస్తూ ముందుకు వెళితే మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రవి, చరణ్ లు మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా ప్రజలకు అందుబాటులో ఈ మినీ హోమ్ థియేటర్ ను తీసుకువచ్చామని తెలిపారు. ఎవరైనా చిన్నచిన్న ఫంక్షన్స్ చేసుకోవాలనుకునే వారికి మూడు గంటల సమయం ఉంటుందని తెలిపారు. అతి తక్కువ ధరలలో అన్ని సౌకర్యాలతో అందుబాటులో ఉంచామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బట్టు రాజేష్, గోపరి లక్ష్మణ్, పార్థసారథి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఆర్ ఎం ఎంటర్టైన్మెంట్స్ నిర్వాహకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.



నూడా చైర్మన్‌ను సన్మానించిన పలువురు

ఉగాది పచ్చడి పంపిణీ

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం భవనంలో తెలుగు నూతన సంవత్సర ఉగాది పండగ సందర్భంగా మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం షడ్రుచులు కలిగిన ఉగాది పచ్చడిని సంఘ సభ్యులకు, గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం క్యాదరి నారాయణ, మాదాస్ మధు, తాళ్ల శ్రీధర్, కొండ శ్రీనివాస్, బిల్ల పురుషోత్తం, మరిపెద్ది రాజు, తాళ్ల రాము, చాట్ల ప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.



రూ.15లక్షలతో సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం

పనులు ప్రారంభించిన టిపిసిసి అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.15లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణంతో ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది అన్నారు. గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు ఇప్పించిన జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ రెడ్డికి గ్రామం తరపున స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, జిల్లా కిసాన్ కేత్ ఉపాధ్యక్షుడు పడిగేలా ప్రవీణ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవతి గంగాధర్, రవి, క్రాంతి, ఎడ్ల శ్రీకాంత్, శ్రీనివాస్, గోపిడి లింగారెడ్డి, మహేందర్, శ్రీధర్, సృజన్, పడల మల్లేష్, ధర్మయ్య బడకల గంగారాం, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన పలువురు

శ్రీ లక్ష్మీనారాయణ ఆలయంలో ప్రత్యేక సమావేశం



నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణ ఆలయ కమిటీ ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా సమావేశమైంది. ప్రతి సంవత్సరం ఉగాది రోజున కమిటీ ప్రత్యేక సమావేశమై ఆలయ భూముల కౌలు విషయంలో గానీ రాబోయే రథోత్సవం ఉత్సవాల గురించి ప్రత్యేకంగా చర్చించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఆదాయం ఖర్చుల గురించి వివరించారు. ఉగాది సందర్భంగా పచ్చడిని భక్తులందరికీ పంపిణీ చేశారు. ఈ ప్రత్యేక సమావేశంలో ఆలయ కమిటీ తోపాటు గ్రామ పెద్దలు, గ్రామస్తులు, గల్లి వాసులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలు నిధులు మంజూరు

- ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపిన ఆలయ కమిటీ సభ్యులు



నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని రథంగల్లీలో గల శ్రీ లక్ష్మీనారాయణ ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు రూ.25లక్షల నిధులు మంజూరు చేయించినందుకు ఆలయ కమిటీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేను కలవడానికి హైదరాబాద్‌కు తరలి వెళ్లేందుకు రెండు క్రూజర్ వాహనాలు దాతగా సహకరించిన బండి వార్ దత్తును శ్రీ లక్ష్మీనారాయణ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

బస్సుల్లేవ్.. ప్రయాణించేదెలా..?

- జుక్కల్ మండలంలోని 8 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు
- గతంలో రోడ్లు బాగోలేవని చెప్పిన అధికారుల
- ప్రస్తుతం రోడ్లు బాగున్నా.. బస్సు సౌకర్యం కల్పించని వైనం
- ఇబ్బందులు పడుతున్న ఆయా గ్రామాల ప్రజలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు





నవతెలంగాణ-జుక్కల్

మారుమూల జుక్కల్ నియోజకవర్గంలోని జుక్కల్ మండలంలోని పలు గ్రామాలకు నేటికి ఆర్టీసీ బస్సులు రావడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అక్కడి నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జుక్కల్ మండలంలోని 30 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలకు సుమారుగా 98శాతం రోడ్ల సౌకర్యంగా ఉన్నప్పటికీ.. నేటికీ టిఎస్ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. గతంలో జుక్కల్ మండలంలోని గ్రామాలకు బస్సు నడపాలంటే రోడ్లు బాగా లేవని బస్సులు నడపలేమని కుంటి సాకులు చెప్పిన అధికారులు.. ప్రస్తుతం 98శాతం అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ.. బస్సు సౌకర్యాలను అధికారులు, నాయకులు బస్సు సౌకర్యం కల్పించడం లేదు. దీంతో గ్రామంలోని విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకప్పుడు కాలినడకనే వివిధ పనుల నిమిత్తం నడుచుకుంటూ మండల కేంద్రానికి వచ్చే ప్రజలు.. ప్రస్తుతమూ డబ్బులు ఇచ్చి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రైవేట్ వాహనాల యజమానులు కుక్కికుక్కి జనాలను వాహనాలలో ఎక్కించుకుంటున్నారు. ప్రైవేట్ వాహనదారులు ధనార్జనే ధ్యేయంగా చట్టవిరుద్ధంగా, నిబంధనలను అతిక్రమించి ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కువ సంఖ్యలో ఎక్కిస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ గ్రామాలకు బస్సులేదు..

మండలంలో 30 గ్రామపంచాయతీలకు సంబంధించిన గ్రామాలైన బిజ్జల్‌వాడి, కత్తల్‌వాడి, మైబాపూర్, చిన్నగుల్లా, కంఠాలీ, కంఠాలీ తాండా, లాడేగాం, లొంగన్ గ్రామాలకు నేటికీ బస్సు సౌకర్యం లేదు. పైన ఉన్న గ్రామాలన్నింటికీ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ టిఎస్ఆర్టిసి అక్కడి గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు బస్సు సౌకర్యం కల్పించకపోవడం విడ్డూరంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

బస్సు సౌకర్యమున్నా.. సమయపాలన లేదు..

మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం ఉన్న సమయపాలన పాటించడం లేదు. బస్సు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ప్రయాణికులు అంటున్నారు. జుక్కల్ మండల కేంద్రం నుంచి బిచ్కుంద మండల కేంద్రానికి రావడానికి ప్రత్యేకంగా లోకల్ బస్సు టిఎస్ ఆర్‌టిసి నడపలేకపోవడంతో జుక్కల్, బిచ్కుంద మధ్యన వెళ్లే ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి.

నిత్యం ఉద్యోగరీత్యా వచ్చే అధికారులు బిచ్కుంద నుంచి జుక్కల్ రావాల్సి వస్తుంది. వారికి రావడానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో అధికారులకు కూడా తలనొప్పిగా మారి సొంత ద్విచక్ర వాహనాలపైనే ప్రయాణం కొనసాగిస్తున్నారు. ముందే ఎండలు మండిపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తెలంగాణలోని పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎండలను తట్టుకొని ఉదయం ప్రయాణం చేయడం మంచిదేనని, అన్ని పనులు వదులుకొని అధికారులు ఉదయం పూట తమ డ్యూటీలకు హాజరవుతున్నారు. కావున ఇప్పటికైనా టీఎస్ ఆర్టీసీ అధికారులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రాజకీయ నాయకుల ప్రోద్బలంతో జుక్కల్ మండలంలోని రోడ్లు ఉన్న అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

చదువుకు ఇబ్బందులు



మా గ్రామానికి గతంలో రెండు పూటలా బస్సు వచ్చేది. ప్రస్తుతం బస్సు రాకపోవడం వలన చదువులు విద్యార్థుల చదువు మధ్యలోనే నిలిచిపోతుంది. పేద విద్యార్థులకు విద్య అందడం కష్టతరంగా మారింది. గతంలో బాన్సువాడ డిఎంను కలిస్తే రెండుపూటలు ఉదయం 6 గంటలకు, సాయంకాలం 6 గంటలకు బస్సు నడిపారు. ప్రస్తుతం బస్సు రావడం లేదు. వెంటనే బస్సును పునరుద్ధరించాలి.

- గౌలే యాదవ్, బిజ్జల్‌వాడి మాజీ సర్పంచ్

బస్సు రావడం లేదు



20 ఏళ్ల క్రితం మా గ్రామానికి కామారెడ్డి డిపో బస్సు నిత్యం నడిచేది. ప్రస్తుతం బస్సు రాకపోకలు నిలిపివేశారు. అప్పట్లో ఆ బస్సు వస్తుందంటే బస్టాండ్ ప్రాంతంలో వివిధ గ్రామాలకు చెందిన వారు అక్కడే వెయిటింగ్ చేసేవారు. ఇప్పుడున్న సమయంలో బస్సులు ఎప్పుడు వస్తాయో ఎప్పుడు రావో తెలియని పరిస్థితి నెలకొంది. వెంటనే మా గ్రామానికి బస్సును నడపాలి.

- మారుతిపటేల్, బిజ్జల్‌వాడీ

ముస్లిం పేదలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మోహినమ్మద్ ఖాద్రి కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-లింగంపేట్

రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది, జలమండలి మాజీ సభ్యులు మహమ్మద్ మోహినమ్మద్ ఖాద్రి కుటుంబ సభ్యులు ఆదివారం ముస్లిం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది మమ్మద్ మోయనమ్మద్ ఖాద్రి సతీమణి ఇస్రాత్ నిస్సా బేగం అక్క చెల్లెలు నెహ్రూ నీ సబ్ బేగం వారి కుటుంబ సభ్యులు ప్రతి ఏడాది రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నిరుపేదలైన కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేస్తారు. అందులో భాగంగానే 600 మందికిపైగా చీరలు, దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పేదలకు రంజాన్ మాసం సందర్భంగా ఆడవారికి చీరలు, మగవారికి దుస్తులతో పాటు నగదు అందజేస్తున్నామన్నారు.

రాజీవ్ యువ వికాసం.. నిరుద్యోగ యువతకు వరం

- యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు బిసా గణేష్

నవతెలంగాణ-గాంధారి



రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగ యువతకు వరమని యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బిసా గణేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడు తూ.. రాజీవ్ యువ వికాసం పథకం స్వయం ఉపాధి ద్వారా చాలామంది నిరుద్యోగ యువతకు ఆర్థిక లబ్ధి చేకూరనుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ నిరుద్యోగ యువత ఏప్రిల్ 5లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

శబరీమాత ఆశ్రమానికి విరాళం అందజేత



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేత

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని శబరీమాత ఆశ్రమానికి రూ.37వేలు విరాళం అందజేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన సురుకంటి రనిల్‌రెడ్డి రూ.11వేలు, రామోజీ సిద్ధిరాములు రూ.11వేలు, ముదాం నరసింహులు రూ.5 వేలు, రాజేశ్వర్‌రెడ్డి రూ.5వేలు, రమాశంకర్ రూ.5వేలు విరాళంగా అందజేశారు. ఆలయ ప్రాంగణంలో జరిగే శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకునేందుకు దాతలు విరాళాలు అందజేస్తున్నారని ట్రస్ట్ కమిటీ సభ్యులు ఏనుగు రాఘవరెడ్డి, కాసెట్టి రామాంజనేయులు, నల్లవెల్లి గంగారెడ్డి, తదితరులు తెలిపారు.

ఆర్మీ అగ్నివీర్‌కు ఎంపికైన కల్వరాల్ యువకుడు



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కల్వరాల్ గ్రామానికి చెందిన జొర్రిగల రక్షిత్ అనే యువకుడు ఇటీవల ప్రకటించిన ఆర్మీ అగ్నివీర్ ఫలితాలలో ఎంపికైనట్టు తెలిపారు. జొర్రిగల భాగ్య లక్ష్మీ రాజేశ్వర్ దంపతుల కుమారుడు రక్షిత్ చిన్నప్పటి నుంచే ఆర్మీలోకి వెళ్లాలని పట్టుదలతో ఉండేవాడు. అందులో భాగంగానే అగ్నివీర్‌కు ప్రయత్నించి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆ యువకుడిని గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ దేశం కోసం ఆర్మీలో చేరాలని పలువురు సూచించారు.

గంగమ్మ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయించండి

- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు



నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని గంగమ్మ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు రవాణా సౌకర్యానికి ఇబ్బంది కలగకుండా చూడాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కల్వకుంట్ల మదన్మోహన్‌రావుకు వివిధ పార్టీల నాయకులు, రామారెడ్డి గ్రామస్తులు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలోని శ్రీ కాలభైరవ స్వామి ఆలయాన్ని సందర్శించగా, ఆలయ పూజరులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది శాలువాతో సన్మానించి స్వామివారి జ్ఞాపికను, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి గంగమ్మ బ్రిడ్జి నిర్మాణాన్ని వర్షాకాలంలోపు పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల బ్రిడ్జి నిర్మాణం జాప్యం జరిగిందని, కాంట్రాక్టు రద్దు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షకు గోశాల ఎరువు వేలం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నారాయణ గోశాల గోవుల ఎరువును ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గోశాల ఆవరణలో ఎరువు వేలంపాట ఆదివారం నిర్వహించారు. రెండు సంవత్సరాలకు సంబంధించిన ఎరువులు వేలంపాటలో రూ.లక్షకు వట్నాల సాయన్న దక్కించుకున్నారు. సాయన్నను శ్రీ లక్ష్మీ నారాయణ గోశాల చైర్మన్ గాండ్ల సంజయ్ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనారాయణ ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, గల్లి వాసులు పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేట్: ముదిరాజ్ జెండాను ఆవిష్కరించిన ముదిరాజ్ సభ్యులు



పిట్లంలో...

ముదిరాజ్ జెండావిష్కరణలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నాగిరెడ్డిపేట్ : మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా ముదిరాజ్ కుల బంధువులందరూ కలిసి ముదిరాజ్ జెండా ఆవిష్కరించారు. షడ్రుచుల పచ్చడితో భాగంగా అలై బలై తీసుకొని గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు ఒకరికొకరు తెలుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఖంబాపూర్‌లో..

పిట్లం : మండలంలోని కంబాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ముదిరాజ్ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముదిరాజ్‌లు ఉదయాన్నే పెద్దమ్మ తల్లికి నియమనిష్టలతో పూజలు నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ముదిరాజ్ సంఘం పెద్దలు మాట్లాడుతూ.. కొన్నేండ్లుగా గ్రామ ఆవరణలోని పెద్దమ్మతల్లిని ప్రతియేటా కొలుస్తూ జెండాను ఆవిష్కరిస్తున్నట్టు తెలిపారు. కాగా స్వీట్లు పంచి ఒకరినొకరు ఆప్యాయంగా కలిసి సహపంక్తి తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పెద్దలు వీర్ సంగప్ప దేశాయ్, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్: మాట్లాడుతున్న ముదిరాజ్ సభ్యులు

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాలలో ఉగాది సందర్భంగా ముదిరాజ్ కులస్తులు పలు గ్రామాల్లో ముదిరాజ్ జెండాలను ఆవిష్కరించారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా కమిటీ, మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని బోనాల్, నూరాయిపల్లి, మెంగారం, అయ్యపల్లి, శెట్పల్లి, శెట్పల్లి సంగారెడ్డి, పోతాయిపల్లి, కోమటిపల్లి, లింగంపేట్, జల్దిపల్లి, మంబోజిపేట్, భవానీపేట్, బానాపూర్, సజ్జనపల్లి, ఎక్కపల్లి, పర్మల్ల, కన్నాపూర్, పొల్కంపేట్ ఆయా గ్రామాలలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లికి చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. పెద్దమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ గ్రామ కమిటీ అధ్యక్షులు ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

నవతెలంగాణ-లింగంపేట్

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి హైకోర్టు సీనియర్ న్యాయవాది జలమండలి మాజీ సభ్యులు మమ్మద్ మోహినమ్మద్ ఖాద్రీ తన ఫామ్ హౌస్‌లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. రంజాన్ ఉపవాస దీక్షల్లో భాగంగా ఉపవాస దీక్షలో ఉన్నటువంటి మైనార్టీ సోదరులకు ప్రతి యేటా ఇఫ్తార్‌విందును ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే ఆదివారం రాత్రి ఖాదిరి ఫామ్‌హౌస్‌లో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మైనార్టీ సోదరులకు వివిధ రకాల పండ్లను అందుబాటులో ఉంచారు. ఉపవాస దీక్షలో ఉన్నటువంటి మైనార్టీ సోదరులకు ఉపవాస దీక్ష అనంతరం భోజనం చేసే కార్యక్రమాన్ని ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఖాద్రి కుటుంబ సభ్యులు, మైనార్టీ సోదరులు కాసిఫ్ వాహబ్, గులాబ్ షాదుల్లా, అబ్దుల్ ఖదీర్, ఫారుక్ నహీం, నజీర్, మస్జిద్ కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కోనసముందర్‌లో పంచాంగ శ్రవణం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోన సముందర్ గ్రామంలో ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు సుధాకర్ శర్మ గ్రామస్తుల సమక్షంలో పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు తమ రాశి ఫలాలు జాతకం ఎలా ఉంటుందని పంచాంగాన్ని చెప్పించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కాంతి సాయన్న, ఉపాధ్యక్షులు ఎలిషాల భూమయ్య, క్యాషియర్ రాజ గంగారాం, కొలిప్యాక ఎల్లయ్య, సామ రాజేశ్వర్ రెడ్డి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



ఎడ్లబండ్ల ఊరేగింపులో పాల్గొన్న రైతులకు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామంలో ఎడ్లబండ్ల ఊరేగింపు చేపట్టిన రైతులను మున్నూర్‌కాపు సదర్ సంఘం ఆధ్వర్యంలో శ్రీ మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సదర్ సంఘం అధ్యక్షులు ముదాం స్వామి, కార్యదర్శి హరి రవి, కోశాధికారి నర్సింలు, మూడు సంఘాల అధ్యక్షులు కొమ్ము భాస్కర్, మాసుల నర్సింలు, గాడి రాజయ్య, హరి నర్సయ్య, గాడి రవీందర్, మెంగని బాల్‌చంద్రం, కొమ్ము చంద్రమోహన్, మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్, మాజీ ఎంపీటీసీ అత్తెలి యశోద కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మెన్ గొండ్లె సిద్ధరాములు, వైస్ చైర్మెన్ శ్రీనివాస్‌యాదవ్, వీడీసీ అధ్యక్షులు పుల్లూరి శివలింగం, అత్తెలి తిరుమలేష్, అత్తెలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రైతులను సన్మానిస్తున్న పలువురు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా సింగిల్‌విండో చైర్మన్ ఇమామ్‌బేగ్ ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు విక్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2300లకు మద్దతు ధర నిర్ణయించినందున రైతులకు మద్దతు ధరతో పాటు, బోనస్ లభించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు బలరాం, గోసుల గంగాకిషన్, స్థానిక నాయకులు గంగాకృష్ణ, రాఘవేందర్, ఖ్యాతం యోగేష్, సుభాష్, నిస్సార్‌బేగ్, పోతన్న సీఈఓ రాందాస్, శంకర్, అర్బాజ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి విరాళం

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన కట్ట రాజేందర్ ఆదివారం అమ్మవారి మందిరం 'శుక్రవారం దేవుని గుడి' ఆలయ నిర్మాణం కోసం తనవంతు ప్రయత్నంగా రూ.11,111 వేల విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కంచు విజయ్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయ నిర్మాణం కోరకు దాతలు ముందుకు రావాలని కోరారు. విరాళ దాత దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచు గంగాధర్, విరాళ దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..



విరాళం అందజేస్తున్న దాత

పిప్రిలో నంది విగ్రహ ప్రతిష్ఠాపన

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని పిప్రి గ్రామంలో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పిప్రి కమాన్ వద్ద నంది విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందిపేట పల్లి గుట్ట మంగి రాములు మహారాజ్ చేతుల మీదుగా ప్రతిష్టాపన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సుంకం భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి

- క్యాలండర్‌ను ఆవిష్కరించిన ఈగ సంజీవ్‌రెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంజీవరెడ్డి

నవతెలంగాణ-మోపాల్

జిల్లా ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ క్యాలెండర్‌ని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం చైర్మన్ ఈగ సంజీవరెడ్డితో ఆదివారి ఆవిష్కరించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని ఈగసంజీవరెడ్డిని ఆదివారం బోర్గాంలోని ఆయన ఇంటివద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈగ సంజీవరెడ్డి మాట్లాడుతూ.. వచ్చే సంవత్సరం నుండి ప్రైవేట్ విద్యాసంస్థ క్రీడాకారుల కోసం టోర్నమెంట్లు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి వ్యాయమ ఉపాధ్యాయులు వారి పాఠశాలలో విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చి క్రీడాకారులను తయారు చేయాలనీ సూచించారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం కూడా క్రీడలను, వ్యాయమ ఉపాధ్యాయులను కూడా ప్రోత్సాహించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షులు అజ్మత్ ఖాన్ కార్యదర్శి మీసాల ప్రశాంత్, కోశాధికారి మురళి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ వినోద్ రెడ్డి, వినోద్ నాయక్, పాల్గొన్నారు.

90శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



ఆస్తిపన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నవతెలంగాణ-భీంగల్ రూరల్

తెలంగాణ ప్రభుత్వం ఆస్తి పన్ను వడ్డీ రాయితీ 90శాతం ఇచ్చినందున పట్టణంలోని పెద్ద మొత్తంలో ఉన్న బకాయి దారులకు 90శాతం రాయితీ గురించి వివరించి, బకాయి దారుల నుండి ఆస్తిపన్నుని కట్టించారు. ఈ అవకాశం ఈనెల 31 తేదీతో ముగుస్తుందని, పట్టణ ప్రజలందరూ ఇట్టి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. భీంగల్ పట్టణంలోని వివిధ సంఘాల ఆస్తి పన్ను, అంజుమన్ కమిటీ వారి ఆస్తి పన్ను వివిధ మొత్తం రెండు లక్షల 50 వేల రూపాయలు ఆస్తి పన్ను వసూలు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. రేపటితో 90శాతం ఆస్తి పన్ను వడ్డీ రాయితీ ముగిస్తున్నందున ప్రజలందరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహునికి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు క్రాంతి, కుమ్మరి భూమన్న, నరేంధర్, సుఖిదాస్, శంకర్, శ్రీనివాస్, రవి, రాజేంద్రప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు..

గుమ్మిర్యాల్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ఏర్పాటుచేసిన ముక్కెర గౌరవ్వ మనుమడు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో కీర్తిశేషులు ముక్కెర గౌరవ్వ జ్ఞాపకార్థం ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముక్కెర గౌరవ్వ మనుమడు ముక్కెర దేవన్న మాట్లాడుతూ... వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని బాటసారుల దాహాన్ని తీర్చడం కోసం, మా నానమ్మ జ్ఞాపకార్థం, చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

ఎడ్లబండ్ల ప్రదర్శన

నవతెలంగాణ-డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి

డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండల కేంద్రాలతోపాటు ఆయా గ్రామాల్లో ఆదివారం ఉగాది పండగ పురస్కరించుకొని కోలలు వేసి అనంతరం ఊర పోచమ్మ గుండా ఎడ్లబండ ర్యాలీ నిర్వహించి నూతన సంవత్సర పంచాంగ పఠనం చేశారు.ఆయా కార్యక్రమలను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పండుగ సందర్భంగా కోలాటాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆయా ఉత్సవాల్లో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్తులు, మాజీ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్ పాల్గొని పూజలను నిర్వహించారు. శివాలయం టెంపుల్ వద్ద వీడీసీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ వాహనాలు ట్రాక్టర్లు, ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. పాడి పంటలు బాగా పండాలని, అందరూ క్షేమంగా ఉండాలని కోరుకున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యం రెడ్డి

నవతెలంగాణ-మెండోర

గ్రామాల అభివృద్దే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యం రెడ్డి అన్నారు. మండలంలోని చాకిర్యల్, కొడిచర్ల గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న మారుమూల గ్రామాల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. చాకిర్యల్ గ్రామానికి 20 లక్షల రూపాయలు, కొడిచర్ల గ్రామానికి 5 లక్షల రూపాయలు అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. మారుమూల ప్రాంతాలలో పాటు అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధికి కృషి చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వెళుతున్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రం అభివృద్ధిలో భాగంగా బాల్కొండ నియోజకవర్గ అభివృదికి కృషి చేస్తున్న ఇంఛార్జి మంత్రి జూపల్లి.కృష్ణారావు, మాజీ మంత్రి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, మానాల.మోహన్ రెడ్డి, అన్వేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ముత్యాల.సునిల్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు అరేపల్లి.మురళి , నాయకులు వేల్పూర్. శ్రీనివాస్, వరిగడ్డి రవి, యూత్ అధ్యక్షుడు సలీం , కాంగ్రెస్ కార్యకర్తలు మధు, రాము , దేవేందర్, సంతోష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ మండలాధ్యక్షులు

ఫ్లడ్ లైట్లు ప్రారంభం



ఫ్లడ్‌లైట్లు ప్రారంభిస్తున్న వీడీసీ సభ్యులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలోని నూతనంగా నిర్మించిన ఫ్లడ్ లైట్లను (ఫోకస్ లైట్లు) గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్తులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి నిధులను వెచ్చించుకుని నిర్మించిన ఫోకస్ లైట్లని ఉగాది సందర్భంగా ప్రారంభించి నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

లెనోవా షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న తాహెర్, కేశవేణు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తాలోగల గిరిరాజ్ కాంప్లెక్స్‌లో ఆదివారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశవేణు, యూనియన్ బ్యాంక్ బడా బజార్ శాఖ చీఫ్ మేనేజర్ మనీష్ కుమార్ షైనీలు శ్రీ కంప్యూటర్ బజార్ వారి లెనోవా ఎక్స్ క్లూజివ్ స్టోర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన, కేక్ కట్ చేసి ల్యాప్‌టాప్ కంప్యూటర్ల కొనుగోలును ప్రారంభించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త కొత్త ఫీచర్స్‌లతో ల్యాప్ టాప్‌లను ప్రతి ఒక్కరికి అందుబాటు ధరలో లభించే విధంగా రూపొందించినట్లు లెనోవా కంపెనీ స్టేట్ హెడ్ కార్తిక్ అయ్యర్, రీజనల్ హెడ్ జస్ప్రీత్ సింగ్, సంతోష్ కుమార్ సింగ్, దిలీప్, విష్ణు, లెనోవా షోరూం యజమాని కేతావత్ వెంకట్ రాములు వివరించారు.

మిట్టపల్లిలో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని మిట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి 2011-2012 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల అద్వర్యంలో గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎం శ్రీనివాస్ గౌడ్, కే రవీందర్, ఈ శ్రీకాంత్ ,సిహెచ్ ప్రశాంత్,రుతురాజ్ గౌడ్, మనోజ్, ఎం నవీన్, అనిల్, నవకాంత్, టి శ్రీకాంత్, దేవేందర్ ,ఈ వినోద్, టి సునీల్, బి శ్రీనివాస్, సిహెచ్ వినోద్, ప్రమోద్, బి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభించిన యువకులు

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సేవలు ఎనలేనివి



నవతెలంగాణ-ఆర్మూర్


మండల కేంద్రంలోని పంచాయతీ రాజ్ సబ్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గడ్డం మహేందర్ రెడ్డి సేవలు ఎనలేనివని పీఆర్‌ఎస్‌సి బావన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతుబజార్‌లో పదవి విరమణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఇంజనీర్ కు సంబంధించిన ఎక్కడ ఏ పనులు జరిగినా ప్రజా ప్రతినిధులతో కాంట్రాక్టర్లతో మమేకమై నాణ్యమైన పనులు చేయించేవారని అభినందించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత బంధువులు, మిత్రులు, కాంట్రాక్టర్లు సామ వెంకటరెడ్డి మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచులు తౌటు గంగాధర్, రెంజర్ల రాజారెడ్డి, ఉప్పులూర్ చిన్నారెడ్డి, బూస నరహరి మాట్లాడుతూ.. మహేందర్ రెడ్డి నాణ్యమైన పనులు చేయడంలో దిట్ట అని, అందరిని గౌరవిస్తూ మర్యాదపూర్వకంగా చూసేవారని పంచాయతీరాజ్ ఇంజనీర్ రంగంలో ఆయన సేవలు అభినందనీయమని కొనియాడారు.. తన 34 వసంతాల ఇంజనీరింగ్ వృత్తి ప్రస్థానంలో అంకితభావంతో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొంది ఉద్యోగానికే వన్నె తచ్చారు. తర్వాత సన్మాన గ్రహీత మహేందర్ రెడ్డి కవిత దంపతులను పంచాయతీరాజ్ సబ్ డివిజన్లు బాల్కొండ, ఆర్మూర్, భీంగల్ తరపున శాలువ, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పిఆర్‌ఈఈ రాజేశ్వర్, డిప్యూటీ ఈఈ కిషన్, భీంగల్ డిప్యూటీ రమేష్, ఇంజనీర్లు నాగేష్ శర్మ, షరీఫ్, రాజు, మేఘన, భట్టాచార్య రాజు, శ్రీనివాసులు, విక్రమ్ రాజ్, నితీష్, గంగాధర్, ఇంద్రసేన రెడ్డి, నవీన్ రెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

సెక్యూర్ చైల్డ్ కేర్ ఏర్పాటు అభినందనీయం

- సెక్యూర్ హాస్పిటల్‌ను ప్రారంభించిన పోచారం

నవతెలంగాణ-కంఠేశ్వర్

సెక్యూర్ చైల్డ్ కేర్ నిజామాబాద్ నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, తెలంగాణ శాసనసభ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఖలీల్ వాడిలో సెక్యూర్ చైల్డ్ కేర్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పీడియాట్రిక్ విభాగంలో చిన్న పిల్లలకు సేవలందించేందుకు ఏర్పాటు చేయడం మంచి విషయం అన్నారు. ఎక్కడికి వెళ్ళకుడా అన్ని సేవలు ఆసుపత్రిలో అందించనున్నారని తెలిపారు. అనంతరం ఆసుపత్రి ఎంబీబీఎస్ ఎండి పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్,(పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ ఫెలోషిప్ బి ఎల్ కే మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ, న్యూఢిల్లీ) వైద్య నిపుణులు డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు, ఫిట్స్, పచ్చకామెర్లకి చికిత్స, అధునాతన గుండె, బిపి పర్యవేక్షణ చికిత్సలు అందిస్తామన్నారు. పిల్లలకు డయాలసిస్ ఈసీజీ, ఈఈజి, ఏబిజి సేవలతోపాటు వాక్సినేషన్ (టీకాలు) అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్ఐసీయూ, పిఐసియు, వెంటిలేటర్, బిఐపిఏపి, సిపిఏపి, హెచ్ఎఫ్ఎన్‌సి, అన్ని రకాల వైద్య సేవలతో పాటు 24గంటల ల్యాబ్, ఎక్స్‌రే, ఫార్మసి సదుపాయం ఉంటుందన్నారు. నవజాత శిశువు వార్మర్, ఫోటో థెరపి లు కూడా చికిత్సలు అందిస్తామని తెలిపారు. ఈ సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్బిన్ హందన్, నుడా చైర్మన్ కేశవ వేణు, తానా అధ్యక్షులు డాక్టర్ శ్రీశైలం, డాక్టర్ మోతిలాల్, డిఎన్బి రేడియాలజిస్ట్ విద్యశ్రీ, మీరాబాయి వెంకట రాములు, డాక్టర్ శ్రీధర్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

గాంధీనగర్‌లో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆయా కాలనీవాసులు తహసిల్దార్ ఆంజనేయులుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో కమ్మర్ పల్లికి రెండు రేషన్ షాపులు మంజూరయ్యాయని, వాటిలో ఒక్కటి గాంధీనగర్, మరొకటి ఉసికే గుట్ట ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేయాల్సి ఉండగా అలా జరగలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన రెండు రేషన్ షాపులను గ్రామంలోనే ఏర్పాటు చేశారని విన్నవించారు. అన్ని రేషన్ దుకాణాలు గ్రామంలోనే ఉండడం మూలంగా గాంధీనగర్ ఇందిరమ్మ కాలనీ, ఉసికే గుట్ట ఇందిరమ్మ కాలనీల్లో నివాసం ఉంటున్న పేద ప్రజలు నిత్యాసర సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముసలి వాళ్ళు, కాళ్ళు చేతులు లేనివారు, బియ్యం తెచ్చుకోడానికి ఇబ్బంది పడుతున్నారని, ఉచిత బియ్యం కోసం రూ.100 ఆటో ఛార్జ్ పెట్టి తీసుకువస్తున్నామని వినతిపత్రంలో విన్నవించారు. గాంధీనగర్‌కి రేషన్ దుకాణాన్ని మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల గంగారెడ్డి, పిఓడబ్ల్యు నాయకురాలు సత్యక్క, ఇందిరమ్మ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగ శుభాకాంక్షలు

పోలీస్ కమిషనర్ సాయిచైతన్య

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ వరిధిలోని ముస్లిం ప్రజలందరికి మార్చ్ 31న రంజాన్ పండుగ సందర్భంగా పోలీస్ శాఖ తరపున నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య శుభాకాంక్షలు తెలియ జేశారు. ఎల్లప్పుడు ప్రజలు పోలీస్ సిబ్బంది స్నేహపూర్వకంగా సోదర భావంతో మెలిగి, అందరూ వారి, వారి కుటుంబసభ్యులతో సుఖ సంతోషములతో వర్ధిల్లి సమాజంలో శాంతి స్థాపనకు అందరు కృషి చేయాలని తెలిపారు.

ఓం పద్మశాలి విజయ సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని ఓం పద్మశాలి విజయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని నిర్వహించారు. సంఘ భవనంలో ఉగాది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సంఘ నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఓం పద్మశాలి విజయ సంఘం నూతన అధ్యక్షులుగా చింత హనుమంతు, ఉపాధ్యక్షులుగా చింత సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు శంకర్, కోశాధికారిగా చింత హనుమంతు, దైవశెట్టిలుగా పోతు అర్జున్, చిలివేరి దేవేందర్, కార్యవర్గ సభ్యులుగా చిలివేరి గంగా ప్రసాద్, ఆడిచర్ల రాజకుమార్, పెండెం మినేష్, బొడ్డు రాజారాం, చింత గణేష్, చింత చక్రధర్, సిలివేరి రాఘవేందర్, రేగుంట సాయిరాం, రాంపల్లి ఉదయ్ కుమార్, బేతు గిరిధర్, కారిగం రమేష్, బొడ్డు అరవింద్, నాయిని అరుణ్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కులదైవం మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సంఘ సభ్యులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

ఓం మార్కండేయ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం..

మండలంలోని ఉప్లూర్ లో ఓం మార్కండేయ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉగాది పండుగ సందర్భంగా సంఘ భవనంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఓం మార్కండేయ సంఘం నూతన అధ్యక్షులుగా నందగిరి దయానంద్, ప్రధాన కార్యదర్శిగా గన్నర్ కేదార్నాథ్, క్యాషియర్‌గా దాసరి రవి, కార్యవర్గ సభ్యులుగా అడిచర్ల అరుణ్, ఎన్నాం నిఖిల్ లను ఎన్నుకున్నారు.అనంతరం పద్మశాలీల కులదైవం మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘ సభ్యులందరికీ ఉగాది పచ్చడిని, తీర్థ ప్రసాదాలు అందజేశారు.కొత్త కార్యవర్గానికి తోటి పద్మశాలి సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మార్చి 31, 2025 | www.navatelangana.com

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు మూడవ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ హరిబాబు ఆదివారం తెలిపారు. ఎస్ఐ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిజామాబాద్‌లోని శివాజీ చౌక్ ఏరియాలో (60 నుంచి 65) వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైంది. అనారోగ్యం కారణంగా లేదా వడ దెబ్బ వలన వ్యక్తి మృతిచెందినట్టు పోలీసులు భావిస్తున్నారు. వ్యక్తి ఒంటిపైన తెలుపు రంగు షర్టు, నలుపు రంగు పాయింట్ ధరించి ఉంది. ఈ వ్యక్తి గత కొన్ని రోజుల నుంచి గుర్బాది రోడ్ వద్ద గల ఎమ్మెస్సార్ బార్ ముందర ఐసిఐసిఐ బ్యాంక్ ముందర తిరగుతూ ఉన్నట్లు తెలిసింది. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తుపడితే టౌన్ 3 పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. వ్యక్తిని గుర్తిస్తే 8712659839, 8712659717 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

హనుమాన్ భక్తుల శోభాయాత్ర

- భీమన్న ఆలయం వద్ద అన్నదానం

నవతెలంగాణ-ఏర్గట్ల

ఉగాదిని పండగను పురస్కరించుకుని మండలకేంద్రంలో హనుమాన్ భక్తులు బజనలు, నృత్యాలతో హనుమాన్ శోభాయాత్రను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇటు ఏర్గట్ల భీమన్న ఆలయం వద్ద చిన్న రేండ్ల, పెద్ద రేండ్ల సంఘాలు కలిసి భీమన్న దేవునికి పూజలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


శోభాయాత్రలో పాల్గొన్న హనుమాన్ స్వాములు


దోమకొండలో ఎడ్లబండ్ల ప్రదర్శనలో పాల్గొన్న పలువురు


కామారెడ్డి : ఉగాది వేడుకల్లో పాల్గొన్న పోలీసులు


కామారెడ్డి : వినాయక్‌నగర్ కాలనీలో..

ఉగాది ఉత్సాహం

ఘనంగా శ్రీ విశ్వావసు నామ సంవత్సర వేడుకలు

- పలు గ్రామాల్లో ఎడ్లబండ్ల ప్రదర్శన, కోలాటం, పంచంగ శ్రవణం, పచ్చడి పంపిణీ
- పెద్దఎత్తున పాల్గొన్న ప్రజలు

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఉదయాన్నే వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇంట్లో షడ్రుచులతో కూడిన పచ్చడిని తయారు చేసుకుని సేవించారు. వివిధ తీపి పిండి వంటకాలను భుజించారు. ఉగాది సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎడ్ల బండ్ల ప్రదర్శన చేపట్టారు. అలాగే పలు గ్రామాల్లో ఆడిన కోలాటం ఆకట్టుకుంది.

నవతెలంగాణ-విలేకరుల బృందం

పిట్లం : మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాలలో ఉగాది పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు నెలలో మొదటిదైన చైత్రమాసంలో వచ్చే ఉగాది పర్వదినం అత్యంత ప్రధానమైనది. హిందువులు ఉదయాన్నే తలంటు స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ఇంటి లోగిళ్ళలో కుటుంబ సమేతంగా షడ్రుచుల పచ్చడి సేవించారు. కాగా వ్యవసాయ పనులను ఉగాది నుండే ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా రైతులు ఉదయాన్నే తమ పంట చేనులలో పూజలు నిర్వహించి పశువుల పేడను చల్లి వ్యవసాయ పనులను ముహూర్తం చేశారు. కాగా ఆయా గ్రామాలలోని గ్రామ చావిడీల వద్ద సాయంత్ర వేళలో ప్రజల ఆధ్వర్యంలో వేద పండితులు పంచాంగ పటణం నిర్వహించారు.

లింగంపేట్ : విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే ఇండ్లకు పచ్చని మామిడి తోరణాలను అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పచ్చడి తయారు చేసి ఆనవాయితీగా ఒకరింటికి ఒకరు వెళ్లి పచ్చళ్లను పంపిణీ చేశారు. తీపి వంటలు చేసి నైవేద్యం పెట్టి పూజలు చేశారు.

మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన..

మండల సమీపంలోని పెద్దవాగు దగ్గర గల మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శనను నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజులపాటు మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలు ప్రతి యేటా నిర్వహిస్తారు. అందులో భాగంగానే మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎడ్లబండ్లను అలంకరించి ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదర్శన నిర్వహించారు. డప్పు సప్పుళ్లతో ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. దూర ప్రాంతాలతో పాటు ఇతర జిల్లాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతితో పాటు రాత్రి వేళ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాఛనీయ ఘటనలు జరగకుండా లింగంపేట్ ఏఎస్ఐ ప్రకాష్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


తాడ్వాయిలో..

తాడ్వాయి : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి రైతులు తాముపండించిన పంటలు అధికంగా దిగుబడి రావాలంటూ ఆయురారోగ్యాలతో ఉండాలంటూ పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అలంకరించిన ఎడ్లబండతో గ్రామ సమీపంలోని ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. చిట్యాల, ఎర్రపాడు, చందాపూర్, బ్రహ్మాజీవాడి, సంతాయిపేట్ తదితర గ్రామాల్లో ఎడ్లబండ్ల ప్రదర్శనలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీల అధ్యక్షులు సహకారంతో ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అధ్యక్షులు మేకల రాజు, ఏనుగు మోహన్ రెడ్డి, సాయిరెడ్డి, రాజిరెడ్డి, రాఘవరెడ్డి, ముదాంనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎడ్లబండ్ల ఊరేగింపు..

దోమకొండ : మండల కేంద్రంలో ఉగాది పండగ సందర్భంగా ఎడ్లబండ్ల ప్రదర్శన కార్యక్రమాన్ని శివ రామ మందిరం ఆలయం నుండి ఎడ్లబండ్ల నిర్వాహకులు డప్పుచప్పుల్ల మధ్య ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై స్రవంతి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. తాహసిల్దార్ సంజయ్ రావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి, మాజీ జెడ్పిటిసి తిరుమల గౌడ్, నాయకులు అబ్రబోయిన స్వామి, నర్సారెడ్డి, సీతారాం మధు, నల్లపు శ్రీనివాస్, పోలీసులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


లింగంపేట్‌లో..

సదాశివనగర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వావసు నామ ఉగాది పండుగ సందర్భంగా మండల కేంద్రంలో సంతోష్ శర్మ పంచాంగ శ్రవణం గ్రామస్తులకు చదివి వినిపించారు. పండగను పురస్కరించుకొని కల్వరాల్, మర్కల్ గ్రామాల్లో డప్పు వాయిద్యాలతో ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. మరికొందరు వాహనాలను కూడా ఆలయాల చుట్టూ ప్రదర్శన చేశారు. మర్కల్ గ్రామంలో ఎడ్ల బండ్ల ప్రదర్శన సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కందకుర్తి గ్రామంలో..

రెంజల్ : మండలంలోని కందకుర్తి గ్రామంలో ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బలిరామ్ హెగ్డేవార్ నిర్మించిన ఆర్ఎస్ఎస్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి కావడం, ఆయన జన్మదినం సందర్భంగా గ్రామంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించాక గ్రామం పెద్దలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు డి. శ్రీనివాస్, ఎస్. శైలేష్, పోశెట్టి, బైరి బద్రి రమేష్, మనోజ్, సూరజ్, రాజు, నరేష్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో పంచాంగ శ్రవణం..

మద్నూర్ : మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో మధ్యాహ్నం ఉగాది పంచాగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. వెంకట్ మహరాజ్ పంచాగ శ్రవణం చదివి వినిపించారు. రోహిణీ నక్షత్రంలో వర్షాలు ఎక్కువగా కురుస్తాయని, వర్షాకాలంలో తక్కువగా వర్షం పడుతుందని పేర్కొన్నారు. ఎర్ర రంగు పంటలు పండుతాయని, రాజకీయ పరంగా ఒడిదొడుకులు ఉంటాయని వివరించారు. రాశుల పరంగా పంచాగం చదివి వినిపించారు. అధిక సంఖ్యలో వ్యవసాయదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఉగాది పండగ

కామారెడ్డి : పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉగాది పండుగ సందర్భంగా షడ్రుచుల ఉగాది పచ్చడిని సేవించారు. మంచి చెడులను ఆస్వాదించి జీవితంలో మెరుగుపడాలని, ప్రజలందరికీ చట్ట ప్రకారంగా సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సీఐ, ఎస్ఐలు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.


మద్నూర్‌లో పంచాంగ శ్రవణం


రెంజల్‌లో..


సదాశివనగర్ : పంచాంగం శ్రవణం వినిపిస్తున్న పురోహితుడు

ఆకట్టుకున్న కోలాటం..

నవతెలంగాణ-రెంజల్/తాడ్వాయి/గాంధారి/ఎడపల్లి

మండలంలోని దూపల్లి గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని గ్రామస్తులు కోలాటం ఆడారు. అత్యంత భక్తి శ్రద్ధలతో భజనలు చేస్తూ కోలాటం ఆడటం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు. ఆలయాల ఎదుట గ్రామస్తులు కోలాటం ఆడగా.. ఆటను తిలకించేందుకు గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బాబన్న, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


తాడ్వాయిలో..

ఎంద్రియాల్‌లో..

తాడ్వాయి : విశ్వావసునామ నూతన సంవత్సర ఉగాది పర్వదిన సందర్భంగా రైతులు పండించిన పంటలు సమృద్ధిగా రావాలని, ఆయురారోగ్యాలతో ఉండాలంటూ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రైతులు ఆలయాల ముందు భక్తి పాటలతో కోలాటం నిర్వహించారు. ఈ ఉత్సవాలలో సంతాజిగారి సుధాకర్ రావు, రమేష్ రావు, రాజిరెడ్డి, పి.సాయిరెడ్డి, విఠల్‌రెడ్డి, వెంకట్రావు, బాలరాజురెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


గాంధారిలో..

గాంధారి : మండల కేంద్రంలోని అంగడి బజార్లో ప్రతి సంవత్సరం హెూలీ సందర్భంగా కోలాటం నిర్వహిస్తారు. కోలాటంను కొప్పులు చేసి ముడి కట్టి ఉంచుతారు. ఉగాది రోజు మళ్ళీ కోలాటం ఆడుతూ ఆ ముడిని కోలాటం ఆడుతూ విప్పుతారు. వందల సంవత్సరాలుగా ఈ ఆనవాయితీ కొనసాగుతుందని గ్రామస్తులు తెలిపారు.

ఎడపల్లి : మండలంలోని పోచారం, తానాకలాన్ గ్రామాలలో ఉగాది పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం, తానాకలాన్ గ్రామాల్లో జడ కొప్పు ఆటను ఆడారు.


ఎడపల్లి : పోచారం గ్రామంలో


రెంజల్ : దూపల్లి గ్రామంలో కోలాటం

పేద ప్రజలకు అండ కాంగ్రెస్ పార్టీ

- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ
- సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డి

పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన మధుసూదన్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) 2లక్షల రూపాయలు చెక్కులు లబ్దిదారునికి కామారెడ్డిలోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూర్ మండలం రామేశ్వరంపల్లి గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి కి ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రిలో ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. అనారోగ్యంతో అప్పుల పాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తాయని తెలిపారు. పేదలకు కాంగ్రెస్ పార్టీ సహాయంగా, అండగా నియోజకవర్గ ప్రజల మంచిని మాత్రమే కోరుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు అర్హులకు త్వరలోనే అందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగానే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. రుణమాఫీ చేసి చూపించాం, రైతు భరోసా అందిస్తున్నాం, మహిళలకు ఉచిత బస్సు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎడ్ల రాజిరెడ్డి, మద్ద్య చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక.. ఇఫ్తార్ విందు

- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి (లింగంపేట్)


ఇఫ్తార్‌విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. ఆదివారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణంలోని మసీదు వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని నాలుగవ పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద రూ.44,720 నగదును స్వాధీనం చేసుకున్నట్లు నాలుగవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బోర్గం గ్రామ శివారులో చెట్టు కింద పేకాటాడుతున్నారని సమాచారం మేరకు.. పేకాట స్థావరంపై రైడ్‌చేసి పేకాటాడుతున్న నలుగురు పేకాటరాయుళ్లను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.44,720 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

- ప్రజలు గమనించాలి
- ట్రాఫిక్ సహాయ కమిషనర్ నారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని నిజామాబాద్ ట్రాఫిక్ సహాయ కమిషనర్ నారాయణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. బోధన్ వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు బస్టాండ్ నుండి బయలుదేరి జెడ్పీ మీదుగా బైపాస్ రోడ్డు, అర్సపల్లి రైల్వే గేటు, అర్సపల్లి మీదుగా బోధన్ వెళ్ళాలని పేర్కొన్నారు. బోధన్ నుండి నిజామాబాద్ వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు అర్సపల్లి రైల్వే గేట్ మీదుగా న్యూ కలెక్టరేట్, బైపాస్ మీరుగా రావాలని తెలిపారు. వేరే ఇతర వాహనాలు బోధన్ వెళ్లాలనుకుంటే మాధవనగర్ బైపాస్, కంఠేశ్వర్ బైపాస్, అర్సపల్లి రైల్వే గేటు మీదుగా బోధన్ చేరుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని నిజామాబాద్ నగర ప్రజలు గమనించాలని ప్రయాణాలు చేసేవారు ట్రాఫిక్ పోలీసులు మళ్లింపులను గమనించాలని విజ్ఞప్తి చేశారు.

సంబురంగా ఉగాది వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం ఉగాది వేడుకలు ప్రజలు సంబురంగా జరుపుకున్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కుక్కల గుట్టలో వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జాతర నిర్వహించారు. మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో ఆనవాయితీ ప్రకారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎడ్లబండ్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఈసంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని కోరుకున్నారు. అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ బండమీది గంగాధర్, మాజీ ఎంపీటీసీ రాజ్ కుమార్, పిఎసిఎస్ సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్ గ్రామస్తులు పాల్గొన్నారు.